ఓయూ పీజీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 21: ఓయూ పరిధిలోని అన్ని పీజీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంఏ, ఎమ్‌కాం, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ తదితర కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ, యూజీసీ నెట్, టీజీ – సెట్ పరీక్షల నేపథ్యంలో వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలు తిరిగి నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

లా కోర్సుల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 21: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువును పొడగించినట్లు ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకాం, ఎల్ఎల్‌బీ కోర్సుల పదో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈనెల 17వరకు స్వీకరించినట్లు చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 23వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎంపీఈడీ పరీక్ష ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను వెబ్‌సైట్ www.osmania.ac. inలో అందుబాటులో ఉంచారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

- మనువాదుల కుట్రలో భాగమే వర్గీకరణ
- తెలంగాణ రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ డి.సర్వయ్య
- విభజించి పాలించడమే బీజేపీ విధానం : కో-కన్వీనర్ ఎం.సత్యనారాయణ
- నియోజకవర్గంలో భారత్ బంద్ విజయవంతం

కర్మన్‌ఘాట్ చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

చంపాపేట, ఆగస్టు 21: మనువాదుల కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు తెరలేపిందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ డి.సర్వయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళిత, మాల సామాజిక సంఘాలు తలపెట్టిన భారత్ బంద్ పిలుపులో భాగంగా బుధవారం ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధి కర్మన్‌ఘాట్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో సమితి కన్వీనర్ సర్వయ్య, కో–కన్వీనర్ ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎస్సీల్లో మెజార్టీగా ఉండే మాల, మాదిగల మధ్య రిజర్వేషన్ల వర్గీకరణ పేరుతో చిచ్చుపెట్టి ఎప్పటికీ ఐక్యత కాకుండా చేసిందని విమర్శించారు. మనువాదుల కుట్రలో భాగంగా విభజించు పాలించు అనే విధంగా ప్రధాని మోదీ, బీజేపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. మనువాదపు విషపు కోరల్లోంచే అత్యున్నత కోర్టులను సైతం కట్టడి చేస్తున్నట్టు స్పష్టమవుతున్నదని ఆరోపించారు. బ్రాహ్మణీయ భావాజాలంలోనే ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన తీర్పు వెలువడిందని విమర్శించారు. న్యాయమూర్తులను శాసిస్తున్న పద్ధతి గతంలో ఎప్పుడూ చూడలేదని, కాషాయ పార్టీ ఏలుబడిలోనే ఈ పరిస్థితి దాపురించిందని అన్నారు. బ్రాహ్మణీయ కుట్రలను బహుజనులు తిప్పికొట్టేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిచ్చన మెట్ల కుల వ్యవస్థను రూపుమాపేందుకు సిద్ధం కావాలని సూచించారు. వర్గీకరణ పేరుతో దళితులకు రాజ్యాంగ ఫలాలు అందకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నిందని, అందులో భాగంగానే క్రిమీలేయర్ విధానాన్ని సైతం అమలు చేసేందుకు మనువాద ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొన్నారు. కుట్రలను తిప్పికొట్టేందుకు దళితులంతా ఏకమవ్వాలని కోరారు. 341 ఆర్టికల్ ప్రకారం ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు. రాజ్యాంగ సవరణ లేకుండానే రాష్ట్రాలకు వర్గీకరణపై అధికారాన్ని కట్టబెట్టడం తగదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో పునరాలోచన చేయాలన్నారు. లేదంటే దేశవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పర్షపు శ్రీధర్, మద్దెల నరేశ్, గౌరీ దేవి రాజు, జంగయ్య, పరమేశ్, మహేందర్, గంగం శివశంకర్, నాగభూషణం, కదారి పెంటయ్య, మద్దెల నర్సింహ, రమేశ్, కాశీనాథ్, భిక్షపతి, పర్షపు మధు రాజ్‌కుమార్, సమలేటి సాయి, చంగల్ చంద్రమోహన్, రాము, నందు, రవీందర్, ఆనంద్, రాములు, రాజేశ్, నర్సింగ్ రావు, చేపూరి శంకర్, గంగం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు: ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఆగస్టు 21: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నేడు మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ శ్రేణులు పిలుపునిచ్చారు. రుణమాఫీపై కాంగ్రెస్ చేసిన మోసాన్ని నిలదీయాలని తెలిపారు. రాష్ట్రంలో 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ చిగిరింత పారిజాత

బడంగ్‌పేట, ఆగస్టు 21: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమారు రూ.47.63 కోట్లతో 15 ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.3.80కోట్లతో రూపొందించారు. కౌన్సిల్‌లో సభ్యులు తీర్మాణాలను ఆమోదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

కారు ఢీకొని బాలుడి మృతి

హయత్‌నగర్, ఆగస్టు 21: హయత్‌నగర్‌లో బుధవారం ఉదయం వేగంగా దూసుకొచ్చిన ఓ కారు ఢీకొన్న ఘటనలో 14ఏండ్ల బాలుడు మృతి చెందాడు. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. కర్మన్‌ఘాట్‌కు చెందిన గోవర్ధన్ కుమారుడు జశ్వంత్(14) 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం బాలుడు హయత్‌నగర్‌లోని భారత్ బెంజ్ షోరూం సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని సమీపంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

వైద్యురాలి హంతకులను కఠినంగా శిక్షించాలి

మృతురాలికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, ఆగస్టు 1: కోల్‌కతాలో వైద్యురాలిని దారుణంగా హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆమె హత్యకు నిరసనగా వనస్థలిపురంలో బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవుళ్లలా చూడాల్సిన వైద్యురాలిని హత్య చేయడం దారుణమన్నారు. పూర్తి విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. మహళల పట్ల గౌరవభావాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవీద్, కార్యకర్తలు, యువతులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

మాదన్నపేట, ఆగస్టు 21: కత్తి వెంటపెట్టుకొని తిరుగుతున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రైన్‌బజార్ వాటర్ ట్యాంక్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న సయ్యద్ యూసుఫ్(29), అబ్దుల్ అహ్మద్ బహిరంగంగా ధూమపానం సేవిస్తుండగా పోలీసులు విచారించారు. పోలీసులను చూసి అబ్దుల్ అహ్మద్ పారిపోయాడు. అనుమానంతో సయ్యద్ యూసుఫ్‌ను తనిఖీ చేయగా అతడి వద్ద కత్తి లభించింది. స్టేషన్‌కు తరలించి విచారించగా.. సయ్యద్ యూసుఫ్ హనుమకొండలో ఓ హత్య కేసులో నిందితుడని తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వినాయక నిమజ్జన యాత్ర సాఫీగా సాగేలా..

మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని వినాయక నిమజ్జనాల కొలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి

మన్సూరాబాద్, ఆగస్టు 21: మన్సూరాబాద్ పెద్ద చెరువులోని కొలనులో నిమజ్జనం చేసేందుకు వినాయక విగ్రహాలను తరలించే మార్గంలో రోడ్లలో ఏర్పడిన గుంతలను పూడ్చాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. వినాయక నిమజ్జనాల ఏర్పాటులో భాగంగా బుధవారం మన్సూరాబాద్ పెద్ద చెరువులోని కొలనును వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నిమజ్జన యాత్ర సాఫీగా సాగేందుకు వీలుగా చెరువు ప్రాంతంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను కోరారు. చెరువు మెయిన్‌గేటు నుంచి వినాయక విగ్రహాలను తీసుకువచ్చి నిమజ్జనం అనంతరం వాహనాలను వెనుక గేటు నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు చెరువు పరిసరాలతో పాటు కొలను వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పెద్ద చెరువులో వివిధ కాలనీల్లోని మండపాల్లో నెలకొల్పిన సుమారు ఐదు వందల పెద్ద వినాయక విగ్రహాలు, ఐదు వేల చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసే అవకాశం ఉందని తెలిపారు. వినాయక నిమజ్జనాల యాత్ర కొనసాగే మార్గంలో రోడ్లను వెడల్పు చేయడంతో పాటు ఇరువైపులా ఉండే చెట్ల కొమ్మలను తొలగించే విధంగా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై ప్రభాకర్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ దామోదర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, టీపీఎస్ మన్సూర్ పాల్గొన్నారు.

కాలనీలు, బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణం

శాలివాహననగర్ అజయ్ హట్స్ నుంచి వాంబే బస్తీ వరకు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణపనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి

మలక్‌పేట, ఆగస్టు 21: మూసారాంబాగ్ డివిజన్‌లోని అన్ని బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని శాలివాహననగర్ అజయ్ హట్స్ నుంచి వాంబే బస్తీ వరకు రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణపనులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేసి కాలనీవాసులకు వినియోగంలోకి తేవాలని జీహెచ్ఎంసీ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో మెరుగైన సదుపాయాలు కల్పించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. బీటీ రోడ్లు త్వరగా చెడిపోతున్నందున ఎక్కువ కాలం మన్నిక వచ్చే సీసీ రోడ్ల నిర్మాణాలకే అధిక ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. అన్ని బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతి, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సూపర్‌వైజర్ కుమార్, బస్తీ వాసులు సరస్వతి, సందీప్ యాదవ్, సబ్బి నవీన్, రాములు, నాగరాజు, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్‌లో సెల్‌ఫోన్ దొంగలు అరెస్ట్

మాదన్నపేట, ఆగస్టు 21: సెల్‌ఫోన్ దొంగలను అరెస్ట్ చేసిన ఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందనవనానికి చెందిన బోయా సుధాకర్, గణేశ్, సాయి సెల్‌ఫోన్లు దొంగలిస్తు ఉండేవారు. ఏప్రిల్ 29న షేఖ్ ముజాహిద్ సంతోష్‌నగర్‌లో బంధువుల కోసం వేచిచూస్తుండగా సుధాకర్, గణేశ్, సాయి ద్విచక్రవాహనంపై వచ్చి అతడి చేతి నుంచి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టగా నందనవనం నివాసితులుగా తెలిసింది. ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

నూతన నియామకం

కందుకూరు, ఆగస్టు 21: బీజేవైఎం బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ తెలిపారు. ముచ్చర్ల గ్రామానికి చెందిన ఊటు మహేందర్‌ను రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్‌గా నియమించారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు..

రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ మహిళా మోర్చా ప్రధానకార్యదర్శి లయ కాలంశెట్టి నెలకొల్పిన స్వయం ఉపాధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ

మన్సూరాబాద్, ఆగస్టు 21: హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ మహిళా మోర్చా ప్రధానకార్యదర్శి లయ కాలంశెట్టి ఆధ్వర్యంలో మహిళల సాధికారత కోసం నాగోల్ డివిజన్ పరిధి ఇంద్రప్రస్తకాలనీలో ఏర్పాటు చేసిన టైలరింగ్ కేంద్రాన్ని కార్పొరేటర్ చింతల అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి కేంద్రాలు ఎంతగానో తోడ్పాటునందిస్తాయని తెలిపారు. హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ నెలకొల్పిన ఉపాధి కేంద్రాల్లో శిక్షణ తీసుకునేందుకు మహిళలు ముందుకు రావాలని సూచించారు. టైలరింగ్‌తో పాటు ఇతర రంగాల్లో తీసుకునే శిక్షణ ద్వారా స్వయంగా మహిళలు చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పడమే కాకుండా మరి కొందరికి ఉపాధి కల్పించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీరజ, వరకుమార్, కాశీనాథ్, గోపాల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఓ ఎస్టేట్ మేనేజర్‌గా వినోద్‌కుమార్

సైదాబాద్, ఆగస్టు 21: కేంద్ర రక్షణ రంగ పరిశోధన సంస్థ (డీఆర్‌డీఓ) హైదరాబాద్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఆర్ఆండ్‌డీ) చీఫ్ ఇంజినీర్, ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ షేక్ గౌస్ మొహిద్దీన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చెన్నై నుంచి బదిలీపై వచ్చిన వినోద్‌కుమార్ (సైన్‌టిస్ట్–ఏఫ్) బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం చీఫ్ ఇంజినీర్, ఎస్టేట్ మేనేజర్‌గా పనిచేస్తున్న డాక్టర్ షేక్ గౌస్ మొహిద్దీన్‌ను పీఎంఓ ఆఫీస్ సోలార్ పవర్ ప్రాజెక్టుల కోసం ఆఫీసర్–ఆన్–స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నూతనంగా ఎస్టేట్ మేనేజర్‌గా నియమితులైన వినోద్‌కుమార్‌కు బాధ్యతలను అప్పగించి రిలీవ్ అయ్యారు.

వారంలోగా సమస్యలు పరిష్కరించాలి

- వరదమంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన
- కాలనీల్లో నీరు నిలువడంతో అధికారులపై లక్ష్మారెడ్డి ఆగ్రహం
- వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశం

నాచారంలో వరదమంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, ఆగస్టు 21: వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. నాచారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వరదనీటి సమస్యలు ఉన్న కాలనీల్లో బుధవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కాలనీల్లో తిరుగుతూ, సమస్యలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కాలనీలో వరదనీరు నిలిచి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాన్‌హోల్స్‌లో పూడికతీతలు చేపట్టకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరానగర్‌లోని ట్రంక్‌లైన్ నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు పూడికతీతలు చేపట్టలేదని తెలిపారు. ట్రంక్ లైన్ మెయింటెనెన్స్ ఎవరు చూస్తున్నారని, అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. వారం రోజుల్లో ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. నాచారం డివిజన్‌లో మళ్లీ పర్యటన చేస్తామని, అప్పటిలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం సతీష్, ఇంజినీరింగ్ ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ ప్రవంతి, శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ ఏఈ రమేశ్, నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి

కందుకూరు నుంచి కమిషనర్ కార్యాలయానికి వెళ్తున్న కార్మికులు

కందుకూరు, ఆగస్టు 21: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. రాష్ట్ర కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడికి మండలం నుంచి వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కొడంగల్ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించారని తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలని కోరారు. ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం అప్పగించాలని చూస్తుందని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మధ్యాహ్న భోజన కార్మికుల అధ్యక్షురాలు ప్రభావతి, అశ్విని, అండాలు, లక్ష్మమ్మ, స్వప్న, సుగుణమ్మ, యాదమ్మ, లక్ష్మీదేవి, రాములమ్మ పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర యువమోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అనీల్

చంపాపేట, ఆగస్టు 21: తెలంగాణ రాష్ట్ర బీజేవైఎం యువమోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చంపాపేటకు చెందిన సిలివేరు అనీల్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Bonasi Sampada,** was the owner of H.No. 11-12-41 (Old), 11-12-90 (New), Plot No. 182, land admeasuring 258.34 Sq.yds. in Survey No. 9/1, situated at Income Tax Colony, Ramakrishnapuram, Saroornagar Village and Mandal, Ranga Reddy District who acquired the same vide Registered Sale Deed No. 3433/2010, Dated 26-08-2010. **Bonasi Sampada has expired on 20-06-2016, leaving behind Bonasi Prakash, B.Mahesh Kumar, K.Sukanya, B.Sravan Kumar, B.Ashwin Kumar as her legal heirs.**

Whoever has got any claims or rights over the above mentioned property. Please Contact: J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.